సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం । 15 । జనవరి । 2024



శ్రీరాముడి అక్షింతలు పంపిణీ
అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. - 9లో



క్రీడల్లో రాణించాలి
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. - 9లో



తెలంగాణ సంస్కృతికి ప్రతీక
ముగ్గులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఫిర్జాదిగూడ మేయర్ వెంకట్‌రెడ్డి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

మినీ సూపర్ మార్కెట్‌లుగా తీర్చిదిద్దుతాం

భువనగిరి టౌన్ : రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్‌లుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబుని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగల రాజయ్య ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. రేషన్ డీలర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పీసీసీ అధికార ప్రతినిధి తంగెళ్లపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కొండపైకి ఆటోలు



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపైకి ఆటోలకు త్వరలోనే ప్రభుత్వం అనుమతించనున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. భువనగిరికి వచ్చిన మంత్రి శ్రీధర్ బాబును విప్ ఐలయ్య ఆదివారం కలిసి ఆటో కార్మికుల సమస్య తెలియజేశారు. కొండపైకి ఆటోలు నడిపించేలా ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. గతంలోనూ కొండపైకి ఆటోలను అనుమతించాలని అసెంబ్లీలో కోరినట్లుగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడారని ఐలయ్య చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ చీర శ్రీశైలం, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కానుగు బాలరాజు ఉన్నారు.

పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక



ముగ్గులు వేస్తున్న మహిళలు

చౌటుప్పల్ : పండుగలతో మానవ సంబంధాలు బలపడుతాయని హెల్త్ ఆఫీసర్ బడుగు శ్రీరాములు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చౌటుప్పల్‌లోని విద్యానగర్‌కాలనీలోని చందన స్కూల్‌లో ముగ్గులు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీకంగా పండుగలు నిలుస్తాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు

వలిగొండ : మహిళల ఆర్థికాభివృద్ధే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం వలిగొండ మండలం గోకారం, తుర్కపల్లి గ్రామాల్లో పీఆర్ ఫౌండేషన్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలే చంద్రశేఖర్ గార్ల సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు పీవీ శ్యాంసుందర్‌రావు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మోదీ సర్కార్ అనే కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, సర్పంచ్‌లు తుమ్మల పద్మావతి, తుర్కపల్లి మాదవి సురేందర్, దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, సీఎస్ రెడ్డి, తుమ్మల యుగందర్‌రెడ్డి, రాచకొండ కృష్ణ, నాగెల్లి సుధాకర్, ఏలూరి శ్యాం, అనిల్ కుమార్, వెంకటేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

• భక్తజన యాదాద్రి



యాదాద్రి ఆలయ వీధుల్లో భక్తుల రద్దీ

• కమనీయం.. గోదాదేవి కల్యాణం



యాదాద్రిలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

నారసింహుడికి నిత్యారాధనలు



శ్రీస్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ, ఆరాధన, అర్చన, నిజాభిషేకం, అర్చన తదితర పూజలు గావించారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం జోడు సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రికి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఊరూరా సంబరం

- అంబరాన్నంటిన భోగి వేడుకలు
- భోగి మంటలు, హరిదాసుల కీర్తనలతో సందడిగా పల్లెలు, పట్టణాలు
- రంగురంగుల ముగ్గులతో మెరిసిన లోగిళ్లు
- పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించిన పెద్దలు
- నేడు మకర సంక్రాంతి

సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఆదివారం భోగి వేడుకలు ఊరూరా వైభవంగా నిర్వహించారు. భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ పల్లెలు, పట్టణాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో గ్రామాలు సందడిగా మారాయి. మగువలు వేసిన తీరొక్క ముగ్గులతో ఇళ్ల లోగిళ్లు మెరిసిపోయాయి.

భువనగిరి టౌన్ : ఊరూరా సంక్రాంతి కళ వచ్చింది. పండుగ సందర్భంగా ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, చిన్నారుల పతంగుల ఎగురవేత, యువత ఆటల పోటీలతో గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. బంధువులు, ఆడపడుచుల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. రైతులు పండించిన పంటలు చేతికొచ్చిన వేళ ఈ పండుగను మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే పల్లె పట్నం అనే తేడా లేకుండా ప్రజలంతా భోగి మంటలతో వేడుకలు ప్రారంభించారు. సాయంత్ర వేళలో చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా గోదా సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.



భువనగిరిలోని గాంధీనగర్‌లో భోగిమంటలు వేస్తున్న కాలనీవాసులు

నేడు మకర సంక్రాంతి

మూడు రోజుల సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండోరోజు సోమవారం మకర సంక్రాంతిని ప్రజలు జరుపుకుంటారు. పొంగలి, పిండి వంటలు వండి పితృ దేవతలకు తర్పణాలు వదులుతారు. ఇళ్ల ముందు డూడూ బసవన్నలు విన్యాసాలు చేస్తూ దీవెనలు అందిస్తాయి.



నల్లగొండలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మహిళలు

సంక్రాంతి సంప్రదాయం

- హోమంతాలపల్లిలో నేడు ఫలహారపు బండ్ల ఊరేగింపు

చింతపల్లి : మండలంలోని హోమంతాలపల్లిలో 300 ఏళ్ల నాటి పేర్వాండ్ల స్వామి దేవాలయంతో ముడిపడిన ఆచారాన్ని గ్రామస్తులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. సంక్రాంతి అనగానే గాలి పటాలు.. పిండి వంటలు.. హరిదాసుల కీర్తనలు.. కోడి పందాలతో పాటు ఇక్కడ ఈ పర్వదినాన్ని వినూత్నంగా జరుపుకుంటుంటారు. ఏటా సంక్రాంతి రోజున గ్రామంలో ఫలహారపు బండ్ల ఊరేగింపు ఆనవాయితీని ఈ గ్రామస్తులు 122 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు.

ఊరేగింపు ఇలా..

సంక్రాంతి సందర్భంగా జరుపుకునే ఫలహారపు బండ్ల ఊరేగింపు సందర్భంగా గ్రామస్తులు ఉపవాస దీక్ష ఉంటారు. ఎడ్ల బండిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. సంక్రాంతి తర్వాత యాసంగి సీజన్ మొదలవుతుంది కాబట్టి కాడెద్దులకు పూజలు చేస్తారు. వందల సంఖ్యలో ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిలో స్వామివారి పూజా సామగ్రి, బొంగులు, బియ్యం పెట్టుకొని డప్పు చప్పుళ్లతో గోవింద నామస్మరణ చేస్తూ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. వేగంగా సాగే ఈ ఊరేగింపులో ఇప్పటి వరకు ఎలాంటి అపశృతి చోటు చేసుకోకపోవడం గమనార్హం. ఇలా దేవాలయం చుట్టూ ఎడ్లబండ్లను తిప్పడం వల్ల తమకు మంచి జరుగుతుందని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఈ ఊరేగింపును తిలకించేందుకు హైదరాబాద్‌తో పాటు దేవరకొండ, మాడ్గుల, మర్రిగూడెం, నాంపల్లి, చారగొండ, కల్వకుర్తి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. సోమవారం జరిగే ఫలహారపు బండ్ల ఊరేగింపు కార్యక్రమానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నైవేద్యంగా బోనాలు



కంఠమహేశ్వర ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న గౌడ కులస్తులు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంతో పాటు ఆవాస గ్రామాల్లో ఆదివారం భోగి బోనాలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పెద్దమ్మ తల్లి, కంఠమహేశ్వర స్వామికి నైవేద్యంగా సమర్పించారు. గౌడ కులస్తులు బోనాలను డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి కంఠమహేశ్వరస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఇందిరానగర్ కాలనీ సమీపంలో, జామచెట్లబావి వద్ద ఉన్న కంఠమహేశ్వర స్వామి, మోత్కూరు బిక్కేరు చెంతన ఉన్న స్వామి వారి ఆలయాలకు తీసుకెళ్లి తీపి బోనాలు సమర్పించారు. ముదిరాజ్ కులస్తులు మోత్కూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించి కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ప్రదక్షిణచేసి బోనాల నైవేద్యం సమర్పించారు. జామచెట్లబావిలోని యాదవ కులస్తులు రామునిబండ వద్ద ఉన్న లింగమంతుల స్వామికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసు అనిల్, బుర్ర ఉప్పలయ్య, బీసు సత్తయ్య, కారుపోతుల వెంకన్న, మొరిగాల రాజయ్య, మొరిగాల సురేష్, బుర్ర యాదయ్య, మొరిగాల సోమయ్య, సూదగాని యాదయ్య, బుషిగంపల సోమయ్య, బుషిగంపల యాకు, బందారపు యాదగిరి, చిలుకూరి యాదగిరి, దబ్బెటి సోంబాబు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మన్నె భీమయ్య, కార్యదర్శి కోమటి మత్స్యగిరి, ఆలయ కమిటీ అధ్యక్షులు ఆరె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మన్నె వెంకటేష్, డైరెక్టర్లు నల్ల నాగయ్య, సభ్యులు కోమటి జనార్దన్, పోతరబోయిన నర్సయ్య, సత్యనారాయణ, పంగ సతీష్, పంగ సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లి ఆలయానికి బోనాలతో వెళ్తున్న ముదిరాజ్‌లు





సంక్రాంతి సంబరాల్లో భాగంగా భువనగిరిలో కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి, ముగ్గులు వేస్తున్న యువతులు, గంగిరెద్దు విన్యాసాలు

ఎంపీ టికెట్‌కు డిమాండ్

- నల్లగొండ, భువనగిరి స్థానాల నుంచి పోటీకి పలువురు ఆసక్తి
- కాంగ్రెస్ నుంచి అధికం
- గులాబీ పార్టీలోనూ పలువురి ప్రయత్నాలు
- ఎక్కడి నుంచైనా పోటీకి తన కుమారుడు సిద్ధమన్న గుత్తా



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీల నుంచి ఎంపీ టికెట్‌కు డిమాండ్ పెరుగుతోంది. వచ్చే నెలలో లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో ఆశావహుల సందడి మొదలైంది. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులు ఎవరనేది ఇంకా నిర్ణయించకపోయినా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

నల్లగొండలో అత్యధికంగా..

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. కాంగ్రెస్‌లో ఇప్పటికే ఎంపీగా పోటీ చేస్తానని మాజీ మంత్రి జానారెడ్డి ప్రకటించారు. ఆయన కుమారుడు రఘువీర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పట్టుపడుతున్నారనే చర్చ సాగుతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూర్యాపేట టికెట్ మాజీమంత్రి దామోదర్‌రెడ్డికి కేటాయించడంతో పటేల్ రమేష్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చింది. రఘువీర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని జానారెడ్డి పట్టుపడుతున్న నేపథ్యంలో పటేల్ రమేష్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇస్తారా లేదా ఎంపీ టికెట్ ఇస్తారా? ఆసక్తికరంగా మారింది. రమేష్‌రెడ్డికి ఏదో ఒకటి కచ్చితంగా ఇస్తారనే చర్చ సాగుతోంది. బీఆర్ఎస్‌లోనూ పలువురు ఆశావహులు ఎంపీ టికెట్‌కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు టికెట్ ఆశించారు. అయినా అధిష్టానం ఇవ్వలేదు. తన కుమారుడికి నల్లగొండ ఎంపీ టికెట్ కావాలని ఇప్పటికే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లిన సుఖేందర్‌రెడ్డి.. నల్లగొండ లేదా భువనగిరిలో ఎక్కడ టికెట్ ఇచ్చినా పోటీ చేస్తామని ప్రకటించారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన శానంపూడి సైదిరెడ్డి, ఓ వ్యాపారవేత్తతోపాటు మరికొందరు నల్లగొండ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

భువనగిరి నుంచి కాంగ్రెస్‌లో పోటీ తీవ్రం

భువనగిరి నుంచి కాంగ్రెస్‌లో పోటీ అధికంగా ఉంది. ఏడెనిమిది మంది టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి పోటీ చేస్తారని గతంలో చర్చ జరగ్గా.. ఇటీవల కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డికి అనుచరుడిగా ఉన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తన కూతురు కీర్తిరెడ్డి కోసం టికెట్ అడుగుతుండగా, జెడ్పీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి కూడా ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, గొంగిడి మహేందర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది. శుక్రవారం తెలంగాణ భవన్‌లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎవరిని పోటీలో ఉంచాలన్న దానిపైనా చర్చ జరగకపోయినా ఆశావహులు మాత్రం టికెట్ విషయాన్ని అధిష్టానం వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. ఇక బీజేపీ నుంచి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌తోపాటు మరో ఇద్దరు పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

బీజేపీ నుంచి పది మంది

బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారి జాబితా కూడా పెద్దగానే ఉంది. పది మంది టికెట్ కోసం పయత్నిస్తున్నారు. ఇటీవల నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో గార్లపాటి జితేందర్, మన్నెం రంజిత్‌యాదవ్, నూకల నర్సింహారెడ్డి, బండారు ప్రసాద్, గోలి మధుసూదన్‌రెడ్డి, లాలూనాయక్, నాగం వర్షిత్ రెడ్డి, నివేదితారెడ్డి, సత్యనారాయణ, మన్మథరెడ్డి తమకు టికెట్ కావాలని అడిగారు. బీజేపీ నుంచి కూడా అంతమంది టికెట్ అడుగుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

భక్తులకు వసతులు కల్పించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శ గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : యాదాద్రికి వచ్చే భక్తులకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆధ్వర్యంలో దేవాలయ ఈఓ రామకృష్ణారావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ భక్తుల రద్దీ పెరిగినందున సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో మాదిరిగానే కొండపైనా శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు చేసుకునేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. భక్తులను ఆధ్యాత్మిక చింతనలోకి తీసుకెళ్లే విధంగా మైకుల ద్వారా శ్రీలక్ష్మీనరసింహస్వామి నామస్మరణ వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. దీక్షాపరులకు కొండపైనే వసతి కల్పించాలని కోరారు, శని, ఆదివారాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ వారు అన్ని డిపోల నుంచి బస్సులు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని, టెంపుల్ సిటీలో కాటేజీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొండపైకి వచ్చే భక్తులకు ఏదైన ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఇబ్బంది జరగకుండా గతంలో మాదిరిగా ఆరోగ్య వైద్యశాల ఏర్పాటు చేయాలని, కొండ కింద బస్సు డిపో సమీపంలో ఉన్న పాత హైస్కూల్ ఖాళీ స్థలంలో వసతి భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు. యోగానంద నిలయం, పాత భవనాన్ని మొత్తం తొలగించి భక్తులకు వసతి గదులు నిర్మాణం చేపట్టాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, నాయకులు బబ్బూరి శ్రీధర్, గోపగాని రాజు, పేరబోయిన బంగారి, రాయగిరి బాలకిషన్ పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండకు దిగువన ఉన్న గండి చెరువు జలకళను సంతరించుకుంది. యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో మల్లన్నసాగర్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి గండి చెరువుకు 35 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. చెరువు ఆదివారం పూర్తిస్థాయిలో నిండి భక్తులకు కనువిందు చేస్తోంది.

వందరోజుల్లో అన్ని పథకాలు అమలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించి వంద రోజుల్లో అన్ని పథకాలు అమలు చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలో మంత్రి తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పేదింటి ఆడబిడ్డలు ఉచిత బస్ ప్రయాణం ద్వారా సొంత గ్రామాలకు వెళ్లారని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో 30 లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, సిలిండర్లపై సబ్సిడీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ సభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. నల్ల గొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తున్నామన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో రూ.10 కోట్లతో హాస్టల్ నిర్మాణం, రూ.100 కోట్లతో నల్లగొండ – ముశంపల్లి – కన్నెకల్ మీదుగా తిప్పర్తి రోడ్డు, రూ.30 కోట్లతో గుండ్లపల్లి నుంచి రేగట్ట వరకు డబుల్ రోడ్డు, రూ.34 కోట్లతో ధర్వేశిపురం వయా దోరేపల్లి నుంచి పగిడిమర్రి వరకు రోడ్డు పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టులో అక్రమాలపై విచారణ చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ రమేష్‌గౌడ్, లక్ష్మయ్య పాల్గొన్నారు







వైభవంగా.. గోదాదేవి కల్యాణం


ఆలయ ముఖ మండపంలో కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న ఆచార్యులు


స్వామివారి అలంకార సేవలను మాఢ వీధిలో ఊరేగిస్తున్న ఆచార్యులు

● యాదాద్రిలో కనుల పండువగా వేడుక

యాదగిరిగుట్ట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం రాత్రి గోదాదేవి – శ్రీరంగనాథుల కల్యాణోత్సవాన్ని ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించారు. తొలుత స్వామిఅమ్మవార్లను విశేషంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధిలో సంప్రదాయంగా ఆలయ ఈఓ, అనువంశిక ధర్మకర్త, ఆచార్యులు, అధికారులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో ముందు నడిచారు. భక్తుల మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో గోదాదేవి – శ్రీరంగనాథులను అధిష్టించి కల్యాణ తంతు ప్రారంభించారు. పంచనారసింహుల సమక్షంలో జరుగుతున్న ఈ కల్యాణ వేడుకలో మొదటగా స్వస్తీవాచనం, పుణ్యాహవచనం, రక్షాబంధనం వంటి సంప్రదాయ ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. అనంతరం జీలకర్ర బెల్లం వంటి కార్యక్రమాన్ని ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథుడిని పరిణయం ఆడే మాంగళ్యధారణ తంతును ఆచార్యులు ఆగమశాస్త్ర ప్రకారం వేద మంత్రాలతో నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి దంపతులు, ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా, సోమవారం సంక్రాంతి పర్వదినాన అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించే కార్యక్రమాన్ని ప్రధానాలయంలో అర్చకులు నిర్వహించనున్నారు.

ఆడపిల్ల గొప్పతనం వివరించేలా..


బ్రాహ్మణపల్లిలో అంగన్‌వాడీ టీచర్ వేసిన ముగ్గు

గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరి ఆడపిల్ల గొప్పతనాన్ని వివరిస్తూ వేసిన ముగ్గురు ఆకట్టుకుంది. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని వేసిన ముగ్గును చేసిన గ్రామస్తులు ఆమెను అభినందించి ప్రశంసించారు.

పాటిమట్లలో ఆరు గ్యారంటీ పథకాలపై..

మోత్కూరు : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన ముగ్గును ఆదివారం భోగి పండుగ సందర్భంగా కుర్మేటి లక్ష్మి తమ ఇంటి ముందు వేసింది. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహ జ్యోతి, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూతలాంటి ఆరు పథకాలను సూచిస్తూ వేసిన ఈ ముగ్గు స్థానికులను ఎంతో ఆకట్టుకుంది.



పాటిమట్లలో వేసిన ఆరు గ్యారంటీ పథకాల ముగ్గు

మాఢ వీధుల్లో కూల్ పెయింట్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ మాఢ వీధుల్లో వైట్ కూలింగ్ పెయింట్‌ను వేస్తున్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తులు మాఢ వీధిలో నడిచే సమయంలో కాళ్లు కాలకుండా ఉండేందుకు ఈ కూలింగ్ పెయింట్‌ను వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

యాదాద్రీశుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. వీరికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద ప్రత్యేక అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా.. ఈఓ రామకృష్ణారావు, ఆలయాధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


తెలంగాణ డీజీపీ రవిగుప్తా దంపతులు, ఏపీ రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవిచౌదరి దంపతులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ప్రధానాచార్యులు

ముగ్గు.. మురిపెం

సంక్రాంతి సందర్భంగా ఇళ్ల ముంగిట వేసిన అందమైన ముగ్గులతో సెల్ఫీలు పంపాలన్న 'సాక్షి' ఆహ్వానానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు మహిళలు, యువతులు, చిన్నారులు తాము వేసిన ముగ్గులతో సెల్ఫీలు దిగి పంపించారు.


బి. గురులక్ష్మీ, మనూష
బీట్ మార్కెట్, నల్లగొండ


రితిక, సిరి ఇడికూడ,
చండూరు మండలం


సాత్విక, ఇడికూడ
చండూరు మండలం


దివ్య, తేజస్విని, భాగ్యనగర్
కాలనీ, నల్లగొండ



యనగందుల కృష్ణవేణి,
విద్యానగర్, మిర్యాలగూడ


కోట లత, నెమ్మాని,
నార్కట్‌పల్లి మండలం


ఎర్ర వసంత, శ్రీనగర్
కాలనీ, నల్లగొండ


పింకి, ఎస్ఎల్‌బీసీ,
నల్లగొండ


బందారు దీక్షిత,
శివాజీనగర్, నల్లగొండ


రేణుక, గొల్లగూడ,
నల్లగొండ


సిరిశ్రీ, రసూల్‌పూర్,
నల్లగొండ


లాస్యారెడ్డి, బొల్లెపల్లి,
భువనగిరి


కవిత,
భువనగిరి


బి. భాగ్య,
తిమ్మాపురం


బి. మనూష, నేలమర్రి, మునగాల మండలం


మిట్టకోల లాస్య
అర్వపల్లి


కుందూరు ఆద్యశ్రీ, మనస్వి,
శాంతినగర్, నల్లగొండ


పారిజాత
అర్వపల్లి


అరుణ, సాయికీర్తన
అర్వపల్లి


రేఖా బోయపల్లి,
జాజిరెడ్డిగూడెం


తుమ్మ మానస
వెలుగుపల్లి


రాళ్లబండ నాగరాణి
శ్రీరాంనగర్ కాలనీ, భువనగిరి

లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు ఖాయం


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 13 నుంచి 14 సీట్లు ఖాయమని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మేళ్లచెరువు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. లోక్‌సభకు మార్చిలో ఎన్నికలు జరగవచ్చని చెప్పారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలోనే బీజేపీ నాయకులు అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తికాకుండానే ప్రారంభించాలనుకుంటున్నారని విమర్శించారు. దేవాలయం పూర్తయితే తాను వెళ్లి దర్శనం చేసుకుంటానన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని కొల్లగొట్టారన్నారు. ఆరు లక్షల డెబ్బయి ఐదు కోట్ల రూపాయల అప్పుచేసి ప్రజలను మోసం చేశారన్నారు.హుజూర్‌నగర్ నియోజకవర్గంలో లిఫ్టుల మరమ్మతులు చేయిస్తానని పేర్కొన్నారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా సర్వే నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా మేళ్లచెరువు గ్రామ పంచాయతీలో రూ.రెండు కోట్లు, మఠంపల్లి పంచాయతీలో 75 లక్షల రూపాయలు బీఆర్ఎస్ హయాంలో దోపిడీ చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అవినీతికి, అధికారం దుర్వినియోగానికి పాల్పడొద్దని కోరారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ పెట్టించి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తానన్నారు.

శివాలయంలో మంత్రి ఉత్తమ్ పూజలు

మేళ్లచెరువులోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాయలంలో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయననకు ఆలయ అర్చకులు పూర్ణకుభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు అందించారు.







సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ ఈ జన్మలోనే మోక్షము పొందవలెనని అనుకుంటున్నారా? అయితే మాండ్యూక ఉపనిషత్తు (సంక్షిప్తం) చదవండి. సాధన చేయండి. మోక్షమును పొందండి. ఉన్నవి 12 శ్లోకాలు మాత్రమే. వాటిని సాధన చేస్తే చాలు మోక్షము పొందడం తథ్యము. సన్యసించడం వంటివి అవసరం లేదు. మీ పనులు మీరు చేసుకొనవచ్చును. పాపులు, పుణ్యులు కులమతాలనే తేడా లేకుండా అందరూ అర్హులే. మాండ్యూక ఉపనిషత్తు ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నవి. విక్రేతలకు మంచి అవకాశం. క్వాంటిటీని బట్టి మంచి ఆఫరు ఉన్నది. సంప్ర॥ డా॥ కంచర్ల రంగయ్య, సెల్: 7995995204 [YA-15181]

Wanted

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167593]

■ ప్రముఖ బ్యాంకింగ్ ఇన్సూరెన్సు సేవా సంస్థ నందు Part/Full Time పనిచేయుటకు 10th ఆపైన చదివినవారు కావలెను. Fixed Payout కలదు. సంప్ర॥ 8106965341, 9553053462 [Y-798408]

■ నల్లగొండ పట్టణంలో బట్టల షాపులో పనిచేయుటకు అనుభవం కలిగిన లేడీ సేల్స్‌మెన్స్ కావలెను. జీతం : 8000 – 12000 సంప్ర॥ 98663 22323 [Y-798307]

■ **Wanted Teachers and Principals** for the corporate school in Nalgonda and surrounding regions. Call 7337337701. No Salary Bar. [HA-13009]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167595]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.